### ప్రభుత్వ దవాఖానల్లో

# సుఖ ప్రసవాలు

- పైసా ఖర్చు లేకుండా సాధారణ డెలివరీలు
- సదాశివనగర్ పీహెచ్‌సీలో ప్రతినెలలో సరాసరి 40 నార్మల్ డెలివరీలు
- మాతా, శిశు ఆరోగ్యంపై సర్కారు ప్రత్యేక దృష్టి
- హర్షం వ్యక్తం చేస్తున్న పేద ప్రజలు



సదాశివనగర్ పీహెచ్‌సీలో బాలింతకు కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్న వైద్యురాలు(ఫైల్)

సదాశివనగర్, డిసెంబర్ 2: మాత, శిశు మరణాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా సర్కారు దవాఖానల్లో అన్ని వసతులను సమకూర్చుతున్నది. ప్రభుత్వ వైద్యశాలల్లో సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీలు జరిగేలా తగిన సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చింది. ప్రతినెలా సుమారు 40వరకు సుఖ ప్రసవాలు జరుగుతున్నాయని పీహెచ్‌సీ వైద్యురాలు ఆస్మా శనివారం తెలిపారు.

ప్రభుత్వం గ్రామాల్లో సబ్‌సెంటర్లను ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామంలో ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు ఎంఎల్‌పీహెచ్, ఆశ వర్కర్లను నియమించింది. వారి ద్వారా గ్రామంలో గర్భిణులను గుర్తిస్తున్నారు. గర్భిణుల వివరాలను సబ్‌సెంటర్‌లో నమోదు చేయిస్తున్నారు. వారికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా వైద్యురాలితో పరీక్షలు చేయించి మందులతోపాటు ఆరోగ్య సలహాలను అందజేస్తున్నారు. బరువు తక్కువగా ఉంటే వారికి సరైన మందులను అందజేసి తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను సూచిస్తున్నారు. గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ పౌష్టికాహారం అందజేస్తున్నారు.

***సుఖ ప్రసవాలకు ప్రాధాన్యం..***

సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సుఖ ప్రసవాలను చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతినెలా సుమారు 40వరకు నార్మల్ డెలివరీలు చేస్తున్నారు. ప్రసవం అనంతరం ఆడపిల్ల పుడితే రూ.13వేలు, మగ పిల్లవాడు పుడితే రూ.12వేలతో పాటు కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్నారు. డెలివరీ అనంతరం పైసా ఖర్చు లేకుండా 102అంబులెన్స్‌లో తీసుకెళ్లి ఇంటివద్ద దించుతున్నారు. డెలివరీ అనంతరం సబ్‌సెంటర్‌లో పనిచేస్తున్న ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు బాలింత, చిన్నారి ఆరోగ్యం విషయంలో అవసరమైన సేవలను అందిస్తున్నారు.

***డెలివరీకి తగ్గిన ఆర్థిక భారం..***

ప్రైవేటు దవాఖానల్లో డెలివరీలు చేయించుకోవడం పేద వారికి ఆర్థిక భారం అవుతున్నది. ప్రస్తుతం ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రైవేటుకు దీటుగా సేవలను అందిస్తున్నారు. నార్మల్ డెలివరీలతోపాటు సిజేరియన్ ఆపరేషన్లు సైతం ఉచితంగానే చేస్తున్నారు. దీంతో పేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గింది. ప్రస్తుతం కామారెడ్డిలో 54రకాల పరీక్షల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా హబ్‌ను ఏర్పాటు చేసింది. అవసరం ఉన్న వారి రక్తాన్ని సేకరించి కామారెడ్డికి పంపిస్తున్నారు. వచ్చే రిపోర్టు ఆధారంగా వారికి చికిత్స నిర్వహిస్తూ.. కావాల్సిన మందులను అందజేస్తున్నారు.

***సదాశివనగర్‌కు ఎన్‌కాస్ అవార్డు..***

ప్రజలకు మంచి వైద్య సేవలను అందిస్తుండడంతో సదాశివనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌కాస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ అసెస్‌మెంట్) అవార్డు వరించింది. కేంద్ర ప్రభుత్వం అందజేసిన ఈ అవార్డుతో ప్రతి సంవత్సరం పీహెచ్‌సీకి రూ.మూడు లక్షలు సమకూరుతాయి. మూడేండ్ల పాటు కేంద్ర సర్కారు ఈ నిధులను అందజేస్తుంది.

#### మెరుగైన సేవలను అందిస్తాం..



సదాశివనగర్ పీహెచ్‌సీ ఎన్‌కాస్‌కు ఎంపిక కావడంతో మరిన్ని మెరుగైన వైద్య సేవలను అందిస్తాం. ప్రభుత్వ దవాఖానల్లోనే అన్ని రకాల రక్త పరీక్షలను చేస్తున్నాం. ప్రైవేటు దవాఖానలకు వెళ్లి లక్షల రూపాయలను వృథా చేసుకోవొద్దు. ప్రభుత్వ దవాఖానల్లో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

***- డాక్టర్ ఆస్మా, సదాశివనగర్ పీహెచ్‌సీ***

### వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

## ఇద్దరి దుర్మరణం



రాములు(ఫైల్)

తాడ్వాయి, డిసెంబర్ 2: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందిన ఘటనలు మండలంలో చోటుచేసుకున్నాయి. తాడ్వాయి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేమి కలాన్ గ్రామానికి చెందిన కుంట రాములు(44) కామారెడ్డిలో బంధువుల వివాహం ఉండడంతో శుక్రవారం ఉదయం వెళ్లాడు. రాత్రి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్న సమయంలో తాడ్వాయిలోని కాలేజీ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతడిని చికిత్స కోసం కామారెడ్డికి తరలించగా.. పరిస్థితి విషమించి మరణించాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

***ఎర్రాపహాడ్ శివారులో కరీంనగర్ జిల్లా వాసి..***

కరీంనగర్ జిల్లా అల్మాస్‌పుర గ్రామానికి చెందిన సత్తయ్య లింగంపేట మండలం నల్లమడుగు గ్రామంలో ఉన్న తమ బంధువుల వద్దకు శుక్రవారం వెళ్లాడు. శనివారం ఉదయం స్వగ్రామానికి బైకుపై బయల్దేరాడు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ శివారులోకి రాగానే మోతె బస్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి, కుటుంబీకులకు సమాచారం అందించామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. కారు ఎర్రాపహాడ్‌కు చెందిన వ్యక్తిదని గుర్తించామని, డ్రైవర్ పరారీలో ఉన్నాడన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

## నిలకడగా నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం



శనివారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు

నిజాంసాగర్, డిసెంబర్ 2: నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా ఉన్నదని ప్రాజెక్టు ఏఈ శివకుమార్ శనివారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగుల (17.80 టీఎంసీల)కు గాను శనివారం సాయంత్రానికి 1403.88 అడుగులు (16.19 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నదని తెలిపారు. ఆయకట్టు కింద యాసంగి పంటల సాగు కోసం రైతన్నలు తూకాలు వేసేందుకు సిద్ధం అవుతుండగా అందుకు అనుగుణంగా నీటి విడుదలను త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో డీఐబీ సమావేశం ఏర్పాటు చేసి, సమావేశంలో తీర్మానం ప్రకారం రైతుల అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

## నిందితులకు శిక్ష పడేలా చూడాలి



అవగాహన సదస్సుకు హాజరైన పోలీసులు

బోధన్, డిసెంబర్ 2: క్రిమినల్ కేసుల నమోదు, సాక్ష్యాల సేకరణతో పాటు ప్రతి అంశంపై పోలీసులు జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని న్యాయస్థానంలో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నర్సయ్య ఆదేశాల మేరకు ప్రతినెలా మొదటి శనివారం పోలీసులకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులో భాగంగా బోధన్ న్యాయస్థానంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతి క్రిమినల్ కేసు, కేసులు వీగిపోకుండా, నిందితులకు శిక్ష పడేలా పోలీసులు జాగ్రత్తలు చేపట్టాలని ఆమె సూచించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శ్యాంరావు మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసే ఎఫ్ఐఆర్‌లో వివరాలు సమగ్రంగా ఉండాలని అన్నారు. మరో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్నాటి సమ్మయ్య వైట్‌కాలర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, వాటిలో కేసుల నమోదు విషయంలో పోలీసులు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎస్సైలు పీటర్, నాగనాథ్, సందీప్, కృష్ణ కుమార్, నీరేశ్, ఎక్సైజ్‌శాఖ సీఐ బాలయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## జోరుగా ధాన్యం కొనుగోళ్లు

- గాంధారి సింగిల్ విండో పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో ఏర్పాటు
- రెండు లక్షల 65వేల బస్తాల ధాన్యం కొనుగోలు
- చివరి గింజ వరకూ కొనుగోళ్లకు సిద్ధం



గాంధారిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

గాంధారి, డిసెంబర్ 2: గాంధారితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. గాంధారి సింగిల్ విండో ఆధ్వర్యంలో గాంధారితోపాటు పేట్ సంగెం, మాతు సంగెం, పొతంగల్ కలాన్, పొతంగల్ కుర్ధు, గుర్జాల్, బ్రాహ్మణ్‌పల్లి, చద్మల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా శనివారం వరకు 2లక్షల 65 వేల బస్తాలను కొనుగోలు చేసినట్లు గాంధారి విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి తెలిపారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకు వస్తుండడంతో ధాన్యం రాశులతో నిండిపోయాయి. ధాన్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకు తేమ శాతం ఉంటే వెంటనే తూకం వేస్తున్నారు. తూకం వేసిన ధాన్యానికి డబ్బులు కూడా రైతు బ్యాంకు ఖాతాలో వారం రోజుల్లోనే జమ అవుతున్నాయి. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని విండో కార్యదర్శి మోహన్‌రెడ్డి తెలిపారు. అన్నదాతలు అధైర్య పడొద్దన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని ఆరబెట్టాలని సూచించారు. కురుస్తున్న వర్షానికి ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.